కుంభమేళా

చాలా భయంకరమైన జంతువు. వందల వేల కాళ్లూ, చేతులూ వున్నాయి దానికి. శూలాల్లా పెరిగిన గోళ్లతో, మొరటుగా, బలిష్టంగా, వున్న చేతుల్ని ముందుకు చాస్తూ, పెద్ద స్థంభాల్లాంటి పాదాల్ని వడివడిగా సారిస్తూ, విరుచుకుపడుతోంది అది. అలల నోళ్లు తెరుచుకుని ముంచుకొచ్చే తుఫానునాటి సముద్రంలా బీభత్సంగా వుందది. నా చేతిలో వున్నది చిన్న కత్తి మాత్రమే! అయినా భయపడకుండా పోరాటం సాగిస్తున్నాను. వేటువేటుకూ దాని చేతులూ కాళ్లూ కుప్ప తెప్పలుగా తెగిపడుతున్నాయి. కానీ యేం లాభం? వొక్క అంగం తెగినప్పుడల్లా రెండు మూడు అంగాలు మొలుచుకొస్తున్నాయి. నన్నమాంతంగా మింగేయడం కోసమన్నట్టుగా లోయల్లాంటి నోళ్లు తెరుచుకుని పైపైకి రాసాగింది. భీకరంగా అరవసాగింది. దాని శబ్దం అంతకంతకూ పెరగసాగింది. కర్ణభేరుల్ని పగలగొట్టేటంత శబ్దం...

వులిక్కిపడి మేలుకున్నాను.

కాస్సేపు ప్రపంచమంతా అలుక్కుపోయినట్టుగా, అయోమయంగా కనిపించింది. వాస్తవలోకంలోకి రావటానికి అయిదారు నిముషాలు పట్టింది. టూరిస్టు బస్సెక్కడో ఆగిపోయి వుందన్న విషయం అర్థమయింది నాకు. బస్సులో ప్రయాణికులెవరూ లేరు. డ్రైవరు సీటుగూడా ఖాళీగా వుంది. జీరో బల్బు కాంతిలో, ఖాళీ సీట్ల బస్సులో నేనొక్కడినే ఠీవిగా కూర్చొని వున్నాను. ఆ నిర్మానుష్య రాజ్యానికి యెదురులేని రారాజులా!

యింకా తెల్లవారినట్టు లేదు. బయటంతా చీకటిగానే వుంది. కానీ నింగినుంచీ నేలవరకు పొడవాటి నక్షత్రాల తెరల్ని వేలాడదీసినట్టుగా దీపాలు తోరణాలు కనిపిస్తున్నాయి. చాలీచాలని ఆ దీపాల కాంతిలో రకరకాల జనాలు వడివడిగా అటూయిటూ తిరుగుతున్నారు. నా నిద్రని భగ్నం చేసిన శబ్దం అటునుంచే వస్తోందన్న విషయం బోధపడటానికి కాస్సేపు పట్టింది.

యీ మనుషుల పుట్టలో బస్సును దించేసిన బస్సుడ్రైవరు యేమయినట్టు? ఆగిపోయిన బస్సులోంచీ యాత్రికులందరూ యెక్కడికెళ్లినట్టు? అయినా యీ సంగతులన్నీ నాకెందుకు? యిలాంటి అనవసరపు కుతూహలాలు నాకు లేవు.

జేబులోంచీ పేనా కత్తిని తీసి, మీటనొక్కి, కత్తి కొనని యెదుటి సీటుకమ్మీ సందులోకి జొనిపాను. బొద్దింక దానిపై కొచ్చింది. మెల్లగా బయటికి లాగాను దాన్ని. కాళ్లు తపతప లాడిస్తూ, కాళ్లు ముందుకూ వెనక్కూ వూగిస్తోందది. వేలితో దాని రెక్కలపైన నిమిరాను. అది కత్తి వాదరపై నుంచీ వొరిగింది. సంచీలోంచీ రెండు ఫలహారపు ముక్కలు తీసి సీటు చివర్లో వేసి, దాని పక్కనే బొద్దింకను వదిలాను. అది బుద్ధిగా భోంచేయసాగింది.

యీ ప్రయాణం ప్రారంభించిన మొదటి రోజునే యీ బొద్దింక నా స్నేహాన్ని సంపాదించుకొంది. అప్పటినుంచీ అప్పుడప్పుడూ దానితో యిలా ఆడుకుంటూనే వున్నాను నేను. గడచిన అజ్ఞాతకాండలో యిలా చాలా జంతవులతో చాలా రకాల కాలక్షేపాలు చేశాన్లే నేను! అయినా మాటాడుకోవాలంటే మనుషులే కావాలన్న రూలెక్కడుంది? జంతవులతో, క్రిములతో, కీటకాలతో మాట్లాడితే తప్పేముంది? ఆ మాటకొస్తే మనిషి తనతో తానే మాటాడుకోవచ్చు. యిప్పుడు నేను చేస్తున్న పని అదేగదా! నేనసలు మాట్లాడననీ, మితభాషిననీ అందరూ అనుకొంటూ వుంటారు. కానీ, పెదవుల్ని కదిలించకుండా యెదుటి వాడికి వినిపించకుండా, నాలో నేనే మాట్లాడకుంటూ వుంటానన్న విషయం యెందరికి తెలుసు? అవసరమయినప్పుడు నన్నే నేను యిద్దరిగా విభజించుకుని, కబుర్లు గూడా చెప్పుకుంటూ వుంటాను. అందరిలా జీవించడానికి నేనేమైనా సామాన్యుడినా? యీ యిలాతలంపైన నాలాంటి జీవి మరొకటుండగూడదు. అనితర సాధ్యంగా జీవించడమేగదా నా ప్రత్యేకత!

గత సంవత్సరం జనవరి నెలనుంచీ అక్టోబరు వరకూ గడచిన కాలానికి అజ్ఞాతకాండ అని పేరు పెట్టాను. ఆ పది నెలల పర్యంతమూ నేను 'మానిసి'లో వుండిపోయాను. 'మానిసి'- అది నేనున్న యింటి పేరు. పెద్ద కాంపౌండు లోపల వొక పడకగదున్న యిల్లు. అదే వూళ్లో వుందో, యే వీధిలో వుందో చెప్పాల్సిన అవసరం లేదు. బయటి ప్రపంచంతో సంబంధాలు లేకుండా చేసిపారేసినప్పుడు అదే వూళ్లో వుంటేనేం? ఆ పది నెలలూ నేను యిల్లుదాటి వరండాలోకి సైతం రాలేదు. పొద్దునా, సాయంత్రమూ, వో పనికుర్రాడొచ్చి కావాల్సిన సామాన్లు తెచ్చి పెట్టి వెళ్లేవాడు. అంతే! మరో మనిషి పొలకువ సైతం వుండేది గాదు. యెవరో యెక్కడో, యేదో చేస్తే దాంతో ప్రపంచమంతా మునిగిపోయినట్టుగా కలవరపడే పత్రికలంటే నాకు గిట్టదు. రేడియో టీవీలు మా యింట్లో వుండవు. ఆరోజుల్లో యధేచ్ఛగా నేనెన్ని పరిశోధనలు చేశానని? మనుషులు కాళ్లతోనే యెందుకు నడవాలి? చేతులతోనే యెందుకు తినాలి? రోజుకు మూడు పూటలూ యెందుకు భోంచేయాలి? పగల్లో భోంచేయడం మానేసి రాత్రుల్లో తింటే శరీరం వొద్దంటుందా? బాత్రూంలో పడుకుని బెడ్రూంలో స్నానం చేస్తే యెలా వుంటుంది? అసలు స్నానం అన్నది శరీరానికంత అవసరమా? తలుపూలూ కిటికీలూ మూసేసి, పగల్ని సైతం రాత్రిగా

మార్చేసి, యిక్కడికిక్కడే వొక అంటార్కిటికా తయారు చేసుకుంటే యెలా వుంటుంది? భోజనం మానేసి విటమిన్ టాబ్లెట్లతో కడుపునింపుకుంటే తప్పేముంది?

వున్నట్టుండి కుడి నుదుటిపైన నరమొకటి లాగసాగింది. పెట్టె తెరిచి, వో మాత్రను పైకి తీసి, గుక్కెడు నీళ్లతో బాటూ దాన్ని శరీరంలోకి తరలించాను. యెడమ తొడ దగ్గర కండరం టకటకలాడసాగింది. మరో మాత్రను మింగాను. లాభం లేదు. రెండు మూడు అడుగులు సారించక తప్పదు.

వొళ్లు విరుచుకుంటూ బస్సులోంచీ కిందికి దిగాను. బస్సుముందు పెద్ద గోతం పట్టా పరుచుకుని, రకరకాల నట్లూబోల్టులతో డ్రైవరు కాలక్షేపం చేస్తున్నాడు. నా అడుగుల చప్పుడు వినబడగానే తలపైకెత్తి చూసి ''మధుసూదన్ సారా?''.. అంటూ పలకరించాడు.

''మధుసూదన్‌గారు. మధు శోధన్... అదీ నా పేరు'' విసుగ్గా అడ్డు తగిలాను నేను.

''అదే అదే.. రెండూ వొకటే గదా!'' అంటూ అతను తనపని తాను చేసుకుపోసాగాడు.

యీ సాధారణమైన మనుషులతో వచ్చిన చిక్కే యిది! మట్టికీ బంగారానికీ, రాయికీ రత్నానికీ, నింగికీ నేలకూ, తేడా యేమిటో వీళ్లు చచ్చినా తెలుసుకోలేరు. యీ భూప్రపంచంలో మధుసూధన్ అనే పేరున్న వాళ్లు కొన్ని వేలమందయినా వుంటారు. కానీ మధుశోధన్ వొక్కడే! యెస్సెస్సీ పాసయి, కాలేజీలోకి చేరుతూనే నేను చేసిన మొదటి పనేమిటి? హైదరాబాదుకు తిరిగీ తిరిగీ, మధుసూదన్ అనే పాత పేరు మార్చుకుని, గెజిట్‌లో మధుశోధన్ అనే నా కొత్తపేరు ప్రింటు చేయించుకుని, ఆ తర్వాత వూపిరి పీల్చుకున్నాను. యేమయితేనేం? కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరికింది. యీ అవనీతలంపైన వున్న వొకే వొక యేకైక మధుశోధన్ నేనే!

డ్రైవరు పెదవినదోలా పంటితో నొక్కిపెట్టి, బోల్టు బిగించుతూ ''యింజన్ పాడయింది పాసింజెర్లంతా జాతర్లోకి దూరేసినారు. యీ   జాతరంటే యీ పక్కనంతా పెద్ద వేడుక... తనివితీరా తిరగేసి రండి...'' అన్నాడు.

దూరంగా యేదో దేవాలయపు గర్భగుడి చుట్టూ దీపాల తోరణాలు వేలాడుతున్నాయి. గుడికవతలివైపున కాలువో, నదో, యేదో ప్రవహిస్తున్నట్టుంది. దీపాల కాంతులు దానిలో ప్రతిఫలిస్తున్నాయి. చీకటి వెలుతుర్లు ఢీకొట్టుకోగా, ట్రాఫిక్ జామయినట్టు యెటు చూసినా వొకటే అలజడి... తుఫానూ, భూకంపమూ, ప్రళయమూ, అన్నీ వొకేసారి సంభవించినట్టున్న జన ఘోష.

విసుగ్గా ''యీ రిపేరు యెంతసేపు పడ్తుంది?'' అని అడిగాను డ్రైవర్ని. ''క్లీనర్ని పక్క వూరికి పంపించినాను... మీరు జాతరలో జల్సా చేసుకోండి సార్! రిపేరు పని పూర్తయినా బస్సు కదలదు. పాసింజెర్లు సాయంత్రం దాకా యీ పక్కకు తొంగి చూడమని చెప్పేసినారు. యెప్పుడో పన్నెండేళ్ల కొకసారి వచ్చే విశేషం! సాయంత్రం గుడిలో పూజయినాకే బస్సు కదిలేది!'' అన్నాడతను. పైపెచ్చు పరమానందంగా పెద్ద స్క్రూడ్రైవరుతో బోల్టునొకదాన్ని చావగొడుతూ విశ్వఘోషకు తనవంతు శబ్దాన్ని సైతం

సరఫరా చేయసాగాడు.

అయస్కాంతాన్ని అంటిపెట్టుకున్న యినుపరజనులా, నది చుట్టూ గుమిగూడిన జనసమూహాలు.. దూరంగా నడవసాగాను. వొకటి... రెండు... మూడు... నా అడుగుల్ని నేనే లెక్కబెట్టుకుంటూ నడవసాగాను. వొంటరిగా నడుస్తున్నప్పుడు నేనిలాగే అడుగులు లెక్కబెట్టుకుంటూ వుంటాను. కాలేజీలో చేరిన తర్వాత హాస్టల్లో వున్నప్పుడు నేను తరచుగా వాకింగ్ కెళ్లేవాణ్ణి. అసలు హాస్టల్లో మన వ్యవహారమే వేరు! అందరూ నిద్రపోతున్న సమయాల్లో మేలుకునేవాణ్ణి. అందరూ మేలుకునే సమయాల్లో నిద్రపోయేవాణ్ణి. వుదయం పదింటికి అందరూ కాలేజీకెళ్లి పోయిన తర్వాత నిద్రలేచేవాణ్ణి. యేవేవో వన్యమృగాలు జలకాలాడి పోయినట్టుగా బాత్రూంలన్నీ అతలాకుతలంగా వుండేవప్పటికి. అయితే మాత్రమేమిటి?. అన్ని బాత్రూంలూ ఖాళీయేగదా! యిష్టమొచ్చినచోట, యిష్టమొచ్చినంత సేపు స్నానం చేసేవాణ్ణి. ఆవేళప్పుడు మెస్సెప్పుడూ ఖాళీయే! నా కోసం ప్రత్యేకంగా టిఫిన్ తీసిపెట్టే సదుపాయం వుండనే వుండేది. పదో, పరకో మనదిగాదు పొమ్మనుకుంటే యిలాంటి ప్రత్యేకమైన పరిగణనలకు తక్కువేముంటుంది? అటెండెన్సు లన్నీ ఫార్సులైపోయాక, రెండు దమ్మిడీలు యెక్కువగా పారేస్తే కాండొనేషన్లొచ్చాక, తరగతి గదిలో యెవడఘోరిస్తారు?· సాధారణ మానవ మాత్రుడే అయిన లెక్చరరొకడు తానేమో పెద్ద సర్వజ్ఞుణ్ణని ఫోజు పెట్టుకొని, వుపన్యాసం దంచుతోంటే, వినయంగా వినడమెవడితరం? అందుకే లైబ్రరీ కెళ్లేవాణ్ణి. అందరూ గుమికూడే జర్నల్సు సెక్షను వైపుకు చూపుల్నయినా తిప్పేవాణ్ణిగాదు. స్టాక్ యేరియాలో కూర్చుని, యింతవరకూ మానవమాత్రుడి హస్త స్పర్శకైనా నోచుకొని నా పుస్తకమేదో కనిపెట్టి, దానితో సంప్రదింపులు సాగించేవాణ్ణి. మధ్యాహ్నం భోజనమయ్యాక మళ్లీ నిద్ర. సాయంత్రాల్లో స్టూడెంట్లందరూ నగర సందర్శనం చేస్తున్న సమయంలో, హాస్టలనే యేకాంత హర్మ్యాన్ని మకుటంలేని మహరాజులా పరిపాలించేవాణ్ణి! రాత్రి భోజనం ముగిశాక, అందరూ గదుల్లోకి దూరి చదువు సంధ్యలూ, చతుర్మక పారాయణలూ, కబుర్ల ధూమాలూ రగిలిస్తున్న వేళల్లో, నేనొక్కడ్నే నగర సంచారం చేసేవాణ్ణి! రాత్రి పదిగంటలు దాటిన తర్వాత నగరాల రోడ్లెంత విశాలంగా తయారౌతాయో యెందరికి తెలుసు? పగలంతా జనాల పాదముద్రల్ని మోసీమోసీ అలసి పోయిన వీధులు, అర్ధరాత్రి దాటిన తర్వాత యెంతగా మారిపోతాయని! రాత్రంతా మేలుకునే టీ హోటళ్లలో దొరికే తినుబండారాల రుచి మామూలు హోటళ్లలో దొరుకుతుందా? దూరాన్ని సిగరెట్లతోనూ, కాలాన్ని టీలతోనూ, అర్ధరాత్రి పర్యటనల్ని పోలీసులూ వాచ్‌మెన్లతో జరిగిన రగడల్తోనూ లెక్కగట్టడం నాలా మరెవరికి తెలుసో చెప్పండి చూద్దాం!

పెద్దలారీలో పట్టగలిగే జనాన్నంతా తనలోనే యిరికించుకుని, చిన్న జీబొకటి కారుబారు చేస్తూ యెదురొచ్చింది. ఆ చీకట్లో అది నాపైకెక్కడ వురికేస్తుందోనన్న భయంతో యెరిగి గంతేశాను. జీబులోని జనమంతా పెద్ద తమాషా యేదో జరిగినట్టుగా వెకిలినవ్వుల గులకరాళ్లు విసిరారు. కోపంతో నా వొళ్లు మండిపోయింది. రోడ్డుపైన్నుంచీ దిగి,

నదినీళ్లకు అంచులా వ్యాపించివున్న యిసుక మేటల గుండా నడవసాగాను. అక్కడ సైతం అక్కడక్కడా వొకరిద్దరు మనుషులు కనిపిస్తూనే వున్నారు, ధాన్యంలోని రాళ్లలా.

నేను కాలేజీలో చదివే రోజుల్లో నిర్మానుష్యమైన పర్వతసానువుల్లోకి వాక్ వెళ్లేవాణ్ణి. యూనివర్శిటీకి వుత్తరంగా పెద్ద కొండల సముదాయముంది. టిఫిన్ తిన్నాక, లంచ్ పాకెట్టు చేత బట్టుకుని అడివిలోకి వెళ్తే యిక తిరిగి రావడం సాయంకాలానికే నన్నమాట! వొకోసారి హవర్‌సైకిల్‌పైన గ్రామసీమలకు వెళ్లే మట్టి బాటలగుండా అలా అలా తిరిగి వచ్చేవాణ్ణి. కానీ వొకటే యిబ్బంది. అప్పుడప్పుడూ మురికిబట్టల కూలీ మనుషులూ, మట్టి ముఖాల రైతులూ యెదురుబడి నాతో మాట్లాడ్డానికి ప్రయత్నించేవాళ్లు. కొందరైతే పెద్ద కలెక్టరుద్యోగాలు చేస్తున్న వాళ్లకిమల్లే 'టయమెంతయింది అయిలూ?'' అని వాకబు చేసేవాళ్లు.

కుడి కణత దగ్గరినరం లాగసాగింది. యెడమ తొడ అదరసాగింది. విసుగ్గా వొక యిసుక మేటపైన కూలబడ్డాను. దూరంగా ఆకాశమనే నల్లటి పాచిలోకి యెవరో పెద్దరాయిని విసిరేసినట్టున్నారు. యేవేవో రంగులుపైకి బుసలు గొట్టుకుంటూ వస్తున్నాయి. దిగాలు పడ్డ ముసలివాడెవడో అసురుసురని నడుస్తున్నట్టుగా, రెండు మూడు గజాల దూరంలో నది గుణగుణా ప్రవహిస్తోంది. ఫర్లాంగు దూరంలో తిరనాళ జనాలు పిచ్చాసుపత్రి రోగుల్లా అక్కడే చక్రాలు గొడుతున్నారు.

ఆ హాహాకారాలకు దూరంగా కూర్చున్నది నేనొక్కడినే! వొక్కడినే! నిజం! గొప్పవాళ్లెప్పుడూ వొక్కడిగానే వుంటారు. యీ లోకానికంతా వొక్కడే సూర్యుడు. వొక్కడే చంద్రుడు. అలాగే యీ లోకానికంతా వొక్కడే మధుశోధన్. యీ ప్రత్యేకత కోసం యెన్ని జాగ్రత్తలు తీసుకున్నానో తెలుసా మీకు? నేను తొడుక్కున్న చొక్కా డిజైను మరొకరి కుండగూడదు. అందుకోసం పనిగట్టుకుని మద్రాసుకు, అవసరమైతే బెంగుళూరుకు వెళ్లడానికి గూడా నేను తటపటాయించలేదు. రాయకపోయినా పర్వాలేదు గానీ, వేరొకడు వాడే రకం పేనాని నా జేబులోకి రానివ్వలేదు. వో షాపులో స్పెషల్‌గా కనిపిస్తోంటే పెద్ద పైపొకటి తెచ్చుకొని స్మోక్ చేయడం ప్రాక్టీసు చేశాను కొన్నాళ్లు. ముంచుకొచ్చే దగ్గు తెరల్ని భరించలేక తర్వాత మానేశాన్లెండి! అది వేరే సంగతి! మద్రాసు బర్మా బజార్లో చిత్రమైన టోపీ వొకటి కనిపిస్తే కొనుక్కొచ్చానొకసారి. దాన్నేసుకుని కాంపస్‌లో తిరుగుతూంటే అందరూ నన్ను యెగబడి చూసేవాళ్లు. వోరోజు కోతొకటి పైనబడి టోపీ కోసం కలబడింది నాతో. వుపయోగానికి వీల్లేకుండా టోపీ చిరిగిపోయింది. ముఖంపైన కంటికి రెండంగుళాల దూరంలో పెద్దగాయమైంది. మా క్లాస్మేట్లు బలవంతంగా హెల్త్ సెంటర్లో చేర్పించారు. అయినా, అదృష్టవంతుడెప్పుడూ తంతే గారెల బుట్టలోనే పడతాడు. నా ముఖంలో కుడికంటికి దగ్గర, నల్లటి పెద్దమచ్చ స్థిరంగా నిలిచిపోయింది. అలాంటి మచ్చ కాంపస్‌లో మరెవరికీ లేదు.

వొక మగాడూ, వొక ఆడదీ చేతులు కూర్చుకుని, వొకరిమీద వొకరు వాలిపోతున్నట్టుగా నడుస్తూ వచ్చి, నేనో యిసుక మేటపైన కనిపించడంతో, కిసుక్కుమని అదోలా

నవ్వుకుంటూ ముందుకు సాగిపోయారు. వాళ్లకేం విచిత్రం కనిపించిందని ఆ నవ్వు? అసలీ మనుషులెందుకు నవ్వుతారు? వీళ్ల యేడ్పులెంత అర్థవంతమైనవో, వీళ్ల నవ్వులంత అర్థహీనమైనవిగా కనిపిస్తాయి నాకు. వొంటరిగా వున్నప్పుడు గుంభనగా, రింగ్ మాస్టరులా హుందాగా వుండే మనిషి, మరొక సాటి మనిషి తోడు దొరకగానే నవ్వుతూ, పేలుతూ, బఫూన్‌లా ప్రవర్తిస్తాడెందుకు? అందుకే పిచ్చిగుంటల్లవాళ్ల మనుషులంతా గుంపులు గుంపులుగా గుమికూడి, జంతువుల్లా విచ్చలవిడిగా తిరగడం నాకు నచ్చదు. అసలు నేను యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లో స్టూడెంట్లందరూ వెల్‌కంపార్టీలూ, ఫేర్వెల్‌డేలూ, యానివర్శిరీలూ, మీటింగులూ, సభలూ, సంతర్పణలూ అని గింజుకు చచ్చేవాళ్లు. వోసారి వాళ్లకు తగిన శాంతి చేశాను. పేరేదైతేనేంలే, యేదో డిపార్టుమెంటు ఫంక్షను. దానికో బోడి గెస్టు కూడా! మా క్లాసులోని స్టూడెంట్లంతా దెయ్యం పూనిన వాళ్లలా వొళ్లు మరచిపోయి పనిచేస్తున్నారు. ఫంక్షన్ సాయంత్రం నాలుగున్నరకు. సరిగ్గా మూడు గంటలకు వాళ్లకో టెలిగ్రాం అందింది. మద్రాసులోని యేదో లాడ్జినుంచీ వచ్చిందది. ''మధుశోధన్ అనే వ్యక్తి అక్కడి గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులకో వుత్తరం గూడా రాసిపెట్టాడు. వెంటనే రండి'' - అదీ వార్త. ఆ వుత్తరంలో యెవరి పేరుందో యేమోనని కంగారు పడుతూ స్టూడెంట్లు చాలామంది మద్రాసుకు వేంచేశారు. రెండు రోజులు తిరిగిన తర్వాత, ఆ పేరున్న లాడ్జీయేదీ మద్రాసులో లేదన్న కొత్త నగ్నసత్యాన్ని తెలుసుకుని వాళ్లు తిరిగొచ్చారు. నేను నా గదిలో ముసుగు తన్ని పడుకుని వున్నాను. రెండు మూడు రోజుల వరకూ యెవరూ నాతో మాట్లాడలేదు. తీరా వొకతను ధైర్యం చేసి పలకరించినప్పుడు ''నేనలా వోసారి మావూరి కెళ్లొచ్చాను. టెలిగ్రాం యెవరిచ్చారో నాకేం తెలుసు?'' అని కసురుకున్నాను. అలా చెప్పకుండా 'నా అంతటి వాణ్ణి నేను యిక్కడ చదువుతుండడమే గొప్ప! అది మరచిపోయి మీరంతా ఫంక్షను ఫంక్షనంటూ వొళ్లు మరచిపోతే నాకొళ్లు మండిపోదా చెప్పండి?' అని స్పష్టంగా నిలదీస్తారా యెవరైనా యీ మామూలు మనుషులను?

దూరంగా రోడ్డుపైన యెద్దుల బండొకటి కందెనలేని చక్రాలతో డబడబలాడుతూ కదులుతోంది. బండికింద వేలాడుతున్న లాంతరు దీపం దిగాలుపడ్డ బిక్షగాడి చూపులా మినుకు మినుకు మంటోంది. బండినిండా బస్తాల్లా క్రిక్కిరిసిన జనాల్లోంచీ యెవరో వొక పల్లెటూరి పిల్ల కూనిరాగం పాడుతోంది. మిగిలిన వాళ్లందరూ కోరస్ అందుకుంటున్నారు. శబ్ద సముద్రంలోకి కలవబోతున్న చిన్న శబ్ద నీరవంలా బండి ముందుకు దొర్లుకుపోతోంది.

అంతే! సామాన్యుల సంగతి అంతే! రొటీన్‌లైఫ్‌లో, గానుగెద్దుల బతుకులా, అరిగిన విలువలతో, నడచినడచీ బండబారిన దారిలో సాగిపోతూనే వుంటారు.కానీ బతుకొకోసారి యెంతటి వాడినైనా మచ్చిక చేసుకుని స్వారీ చేయడానికి ప్రయత్నిస్తూనే వుంటుంది. గుప్పెడు జీతం రాళ్ల కోసం సాదాసీదా గుమస్తాగా రెండేళ్లు బండని లాగినప్పుడు కాలమెంత మెల్లగా దొర్లిందని? నిముషాల్ని సంవత్సరాలుగా, దినాల్ని యుగాలుగా సాగదీసిన

గడ్డురోజులవి. యే ప్రత్యేకతా లేని మనుషుల మధ్య, వాళ్లతో సమానంగా ఫైళ్లలో తలదూర్చి పనిచేయవలసి వచ్చినప్పుడు యెంత చిత్రహింసకు గురయ్యానో అది నాకే తెలుసు! యెవరితోనూ మాట్లాడకుండా నా పనేదో నేను చేసుకుపోయేవాణ్ణి. నా వొంటరి గదిలోకి యెవర్నీ రానిచ్చేవాణ్ణిగాదు. నా గది దాటి బయటికెళ్లే వాణ్ణి గాదు. యే రకమైన వైచిత్రీలేని సాధారణమైన మామూలు అమ్మాయిని పెళ్లి చేసుకొమ్మంటూ కొందరు రాయబారాలు మోసుకొచ్చారు. నేను వాళ్ల ముఖమైనా చూడలేదు.

కుడి చెంపపైన నరం వుబుకుతోంది. యెడమ తొడ దగ్గర రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయి. చేయి జేబులోకి వెళ్లింది. జేబులో మాత్రలు లేవు. వెంటనే రెండు మాత్రలు మింగకపోతే చిరాకు పెరుగుతుంది. పైకిలేచి యిసుక బస్తాల్ని కట్టుకున్నట్టు బరువుగా తయారైన పాదాల్ని బలవంతంగా కదుపుతూ బస్సు ఆగిన వైపుకు తిరిగి నడవసాగాను.

వొకటి... రెండు... మూడు... పది అడుగులు నడిచేసరికి వోపిక సన్నగిల్లింది. యెక్కడినుంచో, తూర్పు ఆకాశపు అంచుల్లోంచీ, జలజలపారుతున్న నదిమీదగా, వొక చల్లని ప్రాభాత వాయువు ముఖాన్ని సోకింది. కొద్దిగా హాయిగా తోచింది. అక్కడే యిసుకపైన కూర్చున్నాను.

చీకటి పలచబారుతోంది. ఆకాశంపైన నీలిరంగు పరచుకుంటోంది. దూరంగా తిరినాళ దగ్గర రకరకాల గుడారాలూ, అటూ యిటూ తిరుగుతున్న మనుషులూ సరిగా ఫోకస్ చేయని లెన్స్‌లోంచీ కనిపించే దృశ్యంలా అలుక్కు పోయినట్టుగా స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నారు. దూ:రంగా పడమటివైపునుంచీ, నదీ తీరం పక్కనే రెండు దీపాలు పరతెంచి వస్తున్నాయి.

అదే తూర్పు దిక్కు! అదే సూర్యుడు! మరో దినం మామూలుగా తెల్లవారబోతోంది. కానీ అప్పుడప్పుడూ యిలాంటి మామూలు రోజే వో ప్రత్యేకమైన దినంగా తయారౌ తుంది. మామూలు గుమస్తాగా గదికీ ఆఫీసుకూ మధ్య గింగిరాలు తిరుగు తున్నప్పుడు, హఠాత్తుగా ఆరోజు నన్ను పలకరించింది. అసలా రోజు దాదాపు వారం దినాలుగా నా వెనకే తిరుగుతున్నట్టు నేను గుర్తించనైనా లేదు.

''నా పేరు మీరు వినే వుంటారు... సినిమాలు డైరెక్టు చేస్తూ వుంటాను'' అంటూ పరిచయం చేసుకున్నాడతను. నేను ఆహ్వానించకపోయినా అతను చొరవగా కుర్చీ లాక్కుని నా ముందు కూర్చున్నాడు. మెల్లగా మొదలుపెట్టాడు. ''యిప్పుడో సినిమా తీయబోతున్నాను. అందులో వోపాత్ర వుంది. వొంటరి తనాన్ని ప్రేమించే వ్యక్తి అతను. యెవరితోనూ మాట్లాడడు. నవ్వంటేే తెలియదతనికి. అప్పుడప్పుడూ వున్మాదానికి గురౌతూ వుంటాడు. దాదాపు హీరోతో సమానమైన పాత్ర. క్రొత్త వ్యక్తైయితే బావుంటుందని నా అభిప్రాయం. మీ ఆఫీసు మేనేజరు నాకు ఫ్రెండు. వోసారి కబుర్లలో యీ పాత్ర సంగతి దొర్లింది. మిమ్మల్నోసారి చూడమన్నాడతను. మీరు గమనిస్తున్నారో లేదో! వారం రోజులుగా నేను మీ నీడలా మీ వెన్నంటే వుంటూ పరీక్షించి చూశాను.

మీరు నాకు నచ్చారు. మీకు మరేమీ అభ్యంతరం లేకపోతే...''

యెవరికీ నచ్చని అపురూపమైన పాత్రయినప్పుడు నేనెందుకొప్పుకోను! చిత్రంలో నేనేమీ పెద్దగా నటించవలసి రాలేదు. డైరెక్టరు చెప్పినట్టల్లా కదిలాను. మాట్లాడాను. అంతే! సినిమా రిలీజయింది. మధుశోధన్ పెద్ద నటుడిగా అమాంతంగా ప్రసిద్ధుడై పోయాడు..

దూరంనుంచీ రెండు దీపాలుగా కనిపించిన వెలుతురు బాగా దగ్గరికి వచ్చింది. వున్న దీపాలు రెండే అయినా జనం మాత్రం యాభైఅరవై మందికి పైగా వున్నారు. ఆ దీపాల్లో వొకటి కమ్మీకి గుడ్డ చుట్టిన కాగడా. యింకొకటి పొడవాటి దీపపు సెమ్మలా కనిపిస్తున్న గరడ సెమ్మం. నాకు యిరవై అడుగుల దూరంలో ఆ కాగడాని నేలలోకి నాటి, గరడ సెమ్మాన్ని నిలబెట్టి, అందరూ చుట్టూ కూర్చుని సేద తీరసాగారు. వాళ్ల మాటలేవీ వినాలన్న కుతూహలం లేదు నాకు. యీ జనమొక మంద. వీళ్ల మాటలు నీటి మూటలు... ఆ విషయం వుద్యోగానికి రాజీనామా యిచ్చిక రెండు నెలలకంతా స్పష్టంగా బోధపడింది నాకు. అంత పెద్ద పాపులారిటీ వచ్చాక యింకా చిన్నా చితకా వుద్యోగ మెవరైనా చేస్తారా? చేస్తే యేం బావుంటుంది? పైగా అంత ప్రసిద్ధుణ్ణయి పోయాక యిక వేషాలు వొకదాన్నొకటి తరముకుంటూ వెతుక్కుని రావూ? అందుకే రాజీనామా యిచ్చాను. కానీ యిదొక వింత ప్రపంచమని ఆ తర్వాతే తెలిసి వచ్చింది. యెన్ని రోజులైనా రెండో ఆఫరు చిత్ర పరిశ్రమ నుంచీ రానేలేదు. నా అంతకు నేనే వెళ్లి వేరొకరి కాళ్లావేళ్లా పడ్డమన్నది యీ జన్మలో జరగని పని. అటు సినిమాలోకమూ, యిటు నేనూ పంతం పట్టుకుని కూర్చున్నాము. వుద్యోగాన్నెలాగూ వదిలేశాను. బ్యాంకులో వున్న డబ్బును ఖర్చు పెట్టుకుంటూ అజ్ఞాతకాండ ప్రారంభించేశాను. ప్రపంచంతో సంబంధం లేకుండా జీవించడమనే కళను ప్రాక్టీసు చేయడం మొదలు పెట్టేశాను...

''రంగ రారా, పండరినాథ రారా!

పండరి భక్తుల మొరాలకించి వేగరారా!''

కీచు కంఠమొకటి నా ఆలోచనల తెరని కత్తిలా చింపేసింది. తిరిగి చూశాను.

అంతవరకూ గుంపులు గుంపులుగా గుమికూడి యేదో గూడుపుఠాణీ చేసిన జనమంతా వొక్కసారిగా పైకి లేచి నిల్చున్నారు. అందరికీ నాయకుడిలా కనిపిస్తున్న వ్యక్తి దీపపు స్తంభంలోకి నూనె పోసి, దీపాన్ని యెగదోసి, జెండా వొకటి చేతబట్టుకుని ముందుకొచ్చి నిలుచున్నాడు. మిగిలిన వాళ్లందరూ అలాంటి జెండాలే చేతికెత్తుకుని దీపం చుట్టూ వలయాకారంగా నిలబడ్డారు. రెండుమూడుసార్లు అటూయిటూ అడుగులు కదిపిన తర్వాత ''రంగ రారా! పండరినాథ రారా!'' అంటూ అందరూ బృందగానం ప్రారంభించారు. దీపం చుట్టూ, వలయాకారంగా కదం తొక్కుతూ, నాట్యం సాగిస్తూ వాళ్లక్కడికక్కడే వొక శబ్ద చక్రాన్ని తయారుచేయసాగారు.

నేనేమిటి? వీళ్ల పాలకువకు జడిసి దూరంగా వెళ్లిపోవడమేమిటి? యెంతటి అలజడినైనా యెదిరించి తట్టుకోవడం నాచేతనౌతుంది. వీళ్ల గొడవని నా చెవుల దరిదాపులకైనా

రానివ్వకుండా అరికడుతూ, ఆచోటే కూర్చుని నాలో నేను మాట్లాడుకోవడం కొనసాగిస్తాను. నేను పట్టుపట్టితే సాధించలేని దేముందీ లోకంలో? చిత్రపరిశ్రమంతటిదే తనంతట తాను లొంగి రెండో పాత్రలో తలుపు తట్టింది. యీ చిన్న భజన బృంద మొకలెక్కా నా ముందు?

నేను ధరించిన రెండో పాత్ర యెలాంటిది? సామాన్యమైనదిగాదు. విలన్ పాత్ర. అసలీ సినిమాలో హీరో పాత్రకు పెద్దగా ప్రాధాన్యతే లేదు. నాదే పెద్ద రోలు అందులో విలన్ యెప్పుడూ వొక కొత్త రకం ఆట ఆడుతూ వుంటాడు. రష్యన్ ర్యూలట్ అని దాని పేరు. పిస్తోలులో ఆరు బులెట్లు పడతాయి గదా! లోపల వొకే వొక బులెట్ పెట్టి మిగిలిన అయిదూ ఖాళీగా వుంచేసి, మజిల్‌ను వేగంగా తిప్పేస్తాడు. యిప్పుడెక్కడ బుల్లెట్ వుందో, యెక్కడ లేదో యెవరికీ తెలియదు. పిస్తోలు కొసని తన మెదడుపైన పెట్టుకుని వ్రేలిని ట్రిగ్గర్‌పైన పెడతాడు. ట్రిగ్గర్ నొక్కితే యేమవుతుందో తనకే తెలియదు. సస్పెన్స్ చూసీ చూసీ, కళ్లు మూసుకుని, రెండు మూడు నిముషాల సేపు సస్పెన్సు భరించాక ట్రిగ్గర్ నొక్కుతాడు. బుల్లెట్ ప్రేలదు చివరిదాకా! యీ ఆటంటే ఆ విలన్‌కెంతో ప్రాణం. నాకూ ఆ గేమ్ భలే నచ్చింది. కానీ వొక్కటే లోటు. సినిమా గదా. డమ్మీ బుల్లెట్లే వాడతారు. నిజం బుల్లెట్లు వాడితేగానీ అసలైన థ్రిల్ దొరకదు గదా! యెప్పటికైనా వో నిజం తుపాకీని సంపాదించి, నిజంగానే ఆడిచూడాలి...

కీచు కంఠంవాడు నాయకత్వాన్ని మరొక కంచు కంఠంవాడికి అంటగట్టినట్టున్నాడు. ''రంగూజండాల భజన, రమ్యమైన రంగనిభజన...'' అంటూ వాడి పాట మొదలయింది. దూరంగా జాతర నుంచీ వస్తున్న వుదయరాగంలో వాళ్లు స్పష్టంగా కనబడుతున్నారు. పదిహేనేళ్లనుంచీ, అరవై వరకూ, రకరకాల వయస్సున్న మగవాళ్ల సముదాయమది. కొందరికి పెద్ద పెద్ద గడ్డాలు గూడా వున్నాయి. కొందరి జుట్టు జులపాల్లా వేలాడుతోంది. తెల్లటి బవిరి గడ్డాలతో, బట్టతలల ముసలాళ్లు కొందరు కుర్రాళ్లలా గెంతుతున్నారు. అందరూ యెర్ర దుస్తుల్ని కట్టుకున్నారు. కాళ్లకు గజ్జెలు కూడా వున్నాయి. తెల్లవారీ తెల్లవారక ముందే, తమ పద ఘట్టనలతో నేలని తట్టి లేపుతూ, వాళ్లా గరడ సెమ్మం చుట్టూ ధూళి మేఘాల సమావేశాల్ని తయారుచేస్తున్నారు. ''రంగూ జండాల భజన, రమ్యమైన రంగని భజన'' వున్నట్టుండి వున్మాదం ఆవహించినట్టుగా పాటా, పాటతో బాటూ వాళ్ల ఆటా వేగాన్ని పుంజుకొంది. ముందుకు మూడడుగులు గెంతి, తిరిగి వెనక్కు నాలుగడుగులు దుమికి. వాళ్లు అక్కడొక శబ్ద సుడిగుండాన్ని సృష్టించసాగారు. రెండు మూడడుగుల దూరంలో నేనొక్కణ్నున్నానన్న స్పృహైనా లేకుండా వాళ్లు కదం తొక్కసాగారు.

అదంతా భక్తేనా? యేమో! నా మట్టుకు నాకు భయమే భక్తిని నమ్మకం. లేకపోతే యిన్నాళ్లూ లేని భక్తి రెండో సినిమా రిలీజయ్యేముందు ముంచుకొస్తుందా? చూశారా, నేనెంత నిజాయితీ పరుణ్నో! వున్న విషయం దాచుకోకుండా చెప్పేస్తున్నాను... రెండో సినిమా ఫెయిలయితే నా భవిష్యత్తేమిటి? మనుష్యుల్నెలాగూ నమ్మలేం. ఆ చిత్ర

దర్శకుడోసారి యెర్రదుస్తుల్ని తొడుక్కుని, మెడనిండా రుద్రాక్షలు వేసుకుని, గడ్డం పెంచుకుని కనిపించాడు. దీక్షలో వుంటే కోర్కెలు తీరుతాయని తీర్మానం చేశాడు. సినిమా పూర్తవుతూనే యీ దీక్ష సంగతేమిటో తేల్చుకుందామని నేనూ దీక్షలోకి దిగేశాను. క్షేత్ర దర్శనానికి ప్రత్యేకంగా కారులో వెళ్లంటే బావుండేది. కానీ వొక్కసారిగా అంత డబ్బు ఖర్చుపెట్టే స్థితిలో లేను. టూరిస్టు బస్సే గతయింది. యీ అణాకానీ మనుషుల్ని నమ్మితే యిలాగే జరుగుతుంది. దీక్షేమవెూ ముగిసింది. తిరుగు ప్రయాణంలో యీ బస్సిక్కడ కాళ్లు పైకెత్తేసింది.

నా కుడికంటిపైన నరం జివ్వున వణుకుతోంది. యెడమ తొడ దగ్గర కండరం కప్పపిల్లలా దబదబలాడుతోంది. లేవాలి. యిక పైకి లేవాలి. తప్పదు... లేవాలి... మనస్సునుంచీ అందుతున్న సంకేతాల్ని శరీరం చాలా ఆలస్యంగా గ్రహిస్తోంది. చివరికెలాగో నిల్చున్నాను. వెనక్కి నడవాలి... నడువు... అదీ... కాళ్లు కదిలించాలి... సంకేతాలు అందుతూనే వున్నాయి... యింతలో... యేం జరుగుతోందో తెలుసుకునేలోగా యేదో జరిగిపోయింది... వొకటి... రెండు... మూడు... నాలుగని లెక్కించక మునుపే నేనక్కడ లేను. యెక్కడున్నాను?... రాతి ముక్కను విసిరినప్పుడు చెరువులో విస్తృతమౌతూ వ్యాపించే జలచక్రంలా భజన బృందం పెద్దదవుతూ వచ్చి నన్నమాంతంగా ముంచి పారేసింది. ఆ చిరు చీకట్లో వాళ్లు నన్నూ తమలో వొకణ్ణిగా అనుకున్నట్టున్నారు. యిటో చేయీ, అటో చేయీ నన్ను వొడిసి పట్టుకున్నారు. అరిచాను. వదిలిపెట్టమని పెనుగులాడాను. వాళ్ల పాటనే జలపాతంలో నాకేక ఆత్మహత్య చేసుకుంది. వొచేత్తో జెండా పట్టుకుని, వేరొక చేత్తో పక్క వ్యక్తి భుజాన్ని వొడిసి పట్టుకుని వాళ్లు అవృత నాట్యం మొదలుపెట్టారు. యెంతసేపని యెదురీదగలను? శరీరంలో త్రాణ లేదు. రాత్రి తిన్న మూడు ముద్దలూ యెప్పుడో జీర్ణమైపోయాయి. గుప్పెడు గుప్పెడుగా తిన్న మల్టీ విటమిన్ మాత్రలు పలాయనం చిత్తగించాయి. నా అస్తిత్వం వాళ్ల నాట్య చక్రంలో పూర్తిగా లయించుకు పోయింది. అయిదారు నిముషాల తర్వాత, తెల్లవారు జామున వచ్చే కలలా, స్పష్టంగా జరుగుతున్న దేమిటో స్ఫురించింది. వాళ్ల ఆట పాటలతో శృతి కలిపేశాను.

కాలమెంతసేపు గడిచిందో తెలియదు. ఆడి ఆడీ అలసిపోయిన తర్వాత, తరువాతి పదం అందుకునే లోపు, విశ్రాంతి కోసం కొంతసేపు భజన ఆగింది. అందరూ నవ్వుతూ రొప్పుతున్నారు. నేనూ వాళ్లతో బాటూ యిసుకపైనే కుప్పకూలిపోయాను. వగర్చే వోపిక గూడా లేదు. కొలిమి తిత్తిలా యెదరొమ్ము యెగిరెగిరి పడుతోంది. గరుడసెమ్మంలోని దీపంపైకి గూడా వొక తెమ్మెర సోకినట్టుంది.

తూర్పున యెర్రటి సూర్యబింబం. నీలి ఆకాశపు చివర్లోకొచ్చి బిడియంగా నిలబడి వుంది. నదిపైన పాతకాలపు పుట్టిపైన చిన్నగుంపొకటి జాతరవైపునకు తరలిపోతోంది.

''మందేవూరు?'' తిరిగి చూశాను.

చామనఛాయ ముఖం... పొడవాటి గడ్డం... నల్లటి గడ్డం మధ్యలో తెల్లటి వెంట్రుకల

చారొకటి... సమాధానం చెప్పాను.

''చాలా దూరమేనే!... భలే అడుగేసినావే! ప్రాక్టీసుందా?''

నేను అడుగేయడ మెక్కడ? నా అస్తిత్వం వాళ్ల నాట్య చక్రపు తాకిడికి మాయమై పోయిందంతే! నన్ను కదిపిందీ, నడిపిందీ, ఆడించిందీ అంతా అదే గదా!

''నేను కొంచేపు ఆ కాలవ మరవ దగ్గరికి పొయినాను. మావోళ్లు చీకట్లో నన్నే నువ్వను కున్నట్టున్నారు. చూసినావా. నా గడ్డం గూడా నీకు మాదిరే వుంది...''

గరుడసెమ్మంలో నూనెపోసి, వత్తియెగదోసి, వోవ్యక్తి జెండా కర్ర పైకెత్తి పట్టుకుంటూ ''యిదేకదా; యిదేగదా, మన పండరి క్షేత్రంబిదేగదా!'' అంటూ మరో సంకీర్తన మొదలుపెట్టాడు. యెక్కడివాళ్లలాగే పైకిలేచి వృత్తంగా నిలబడి స్వరం కలిపారు. నలుపు తెలుపుల గడ్డమతను బలవంతంగా నా చేయి పట్టుకుని పైకి లేపాడు. అటువైపు చేతిని మరొకడు పట్టుకున్నాడు. నాకూ యీసారి మొరాయించాలనిపించలేదు. మళ్లీ భజన ప్రారంభమైంది.

''యిదేగదా, యిదేగదా, మన పండరి క్షేత్రమిదే గదా!''

యెక్కడో కొండల్లో బండరాళ్ల కింద బిందువులుగా పుట్టి, వూటగా మారి, జల్లగా కదిలి తనలాంటి పాయలతో ముడిబెట్టుకుంటూ సెలయేరుగా సాగి, నదుల్లో కలిసి, చివరికి సముద్రంలోకి దూకే జలరాశిలా, యెవడో వొక బవిరిగడ్డపు ముసలాయన పెదవుల్లోంచీ జారిన శబ్దం, మిగిలిన భజన బృందపు స్వరాలతో కలిసి, వాళ్ల పాదాల మంజీరాల గలగలతో పెనవేసుకుని, అదొక హేళగా కదులుతున్న నాట్య భంగిమల రవళులతో తలబడి, చివరికి చిత్రమైన రసార్ణవంలో లయించుకపోతోంది. తెల్లటి పట్టకంలోంచీ దూసుకెళ్లే వొంటరి కిరణం రంగురంగులుగా విప్పారినట్టుగా, మ్యూజికల్ ఫౌంటెన్‌లో రంగులూ, నీటి బుడగలూ, కాంతి పూసలూ అల్లుకుపోయినట్టుగా, భజన సాగింది.

యెంతసేపలా సాగిందో నాకు తెలియదు. పెద్ద పళ్ల చక్రం దగ్గరికెళ్లి దానిలో అమిరిపోయే చిన్న పళ్లచక్రంలా భజన బృందం యెప్పుడో జాతర దగ్గరికి చేరిపోయింది. ఆడీ ఆడీ, పాడీ పాడీ, అలసీ సొలసీ జన సమూహాల మధ్య యిసుక మేటల పైన వొరిగిపోయిన తర్వాత, చుట్టూ కలయజూశాను.

రకరకాల దుస్తుల్లో రకరకాల జనం... బారులు బారులుగా వివిధ రకాల డేరాల్లో అంగళ్లు... ప్రతి అంగడి చుట్టూ జనం... గాజులు, దండలు, పాత్రలు, బొమ్మలు, బట్టలు, తినుబండారాలు... చాలా రకాల వస్తువుల అమ్మకం జోరుగా సాగుతోంది. వెలిసిన బట్టల వాళ్లూ, కాకిరంగు దుస్తులవాళ్లూ, అద్దాలు కుట్టిన పావడలు కట్టుకున్న వాళ్లూ, పాదాలకూ చేతులకూ పెద్ద పెద్ద కడియాలు ధరించిన వాళ్లూ, నలిగిన సవకాల్తో తలపాగాలు చుట్టుకున్న వాళ్లూ, వొంటినిండా రంగురంగుల పూసలదండల్ని మోస్తున్న వాళ్లూ... ఆ గుంపు యేరోజుకారోజు కోతలు కోసి పొట్టనింపుకునే కూలి

జనాలైవుంటారు. బహుశా యీ గుంపు కొండకోనల్లో బతికే అటవిక సమూహాలై వుండొచ్చు. వొకవేళ యీ సమూహం మెట్ట భూముల్లో చాలీచాలని పంటల్ని పండించే మామూలు రైతులే వుండొచ్చు. యిటువైపు వెళ్తున్న యీ గుంపు వైనాన్ని గమనిస్తే, వాళ్ల వూళ్లకు దూరంగా బతుకుతూ పంట పొలాల్లో కాయకష్టం చేసే దినకూలీలేమో ననిపిస్తోంది. వెలిసిన బట్టలు... కొన్ని చిక్కిన శరీరాలు... అక్కడక్కడా చెదురుమదురుగా వయస్సులో తమస్సుతో వున్న దేహాలు... వొకటే చెమట వాసన... వొకటే సందడి... కోలాహలం... వేడుక... వినోదం... కేరింతలు... త్రుళ్లింతలు... పకపకలు... అన్ని ముఖాల్లోనూ యేదో వుత్తేజం తొణికిసలాడుతోంది. ప్రతి ముఖమూ వొక గరుడసెమ్మంలా వెలుగుతోంది.

''బారెడు పొద్దెక్కింది... ఆకలిగా లేదా!''

తెలుపూ నలుపు గడ్డంవాడు అడుగుతున్నాడు.

నాకూ కడుపులో యేదోలా వుంది. ఆకలేనా?

అతను సమాధానం కోసం యెదురుచూడకుండా చేయి పట్టుకుని, నది గట్టుకు లాక్కెళ్లడు. దోసిళ్లతో నీళ్లు ముంచుకుని, నీళ్లతోనే ముఖప్రక్షాళనం గావించాడు. నదినీళ్లు వెచ్చగా, తీయగా వున్నాయి. రెండు మూడుసార్లు నీళ్లు ముఖంపైన చల్లితే ప్రాణం లేచి వచ్చినట్టయింది. మళ్లీ అతను నా చేయి పట్టుకుని వో గుడారంలోకి లాక్కెళ్లాడు. వుడుము పట్టంటే యేమిటో అతడు పట్టుకున్నప్పుడు తెలిసొచ్చింది. కానీ వద్దనడానికెందుకో మనసొప్పలేదు. గుడారంలో రాళ్లపొయ్యిపైన పెద్ద సత్తుడేగ్సాలో యిడ్లీలు వుడుకుతున్నాయి. వేరే పొయ్యిపైన నల్లటి యినప బాణలిలో వడలు వేగుతున్నాయి. చుట్టూ జనం నేలపైన గుదికాళ్లపైన కూర్చుని మద్దాకు విస్తళ్లలో నాస్టాలు తింటున్నారు. గరుడసెమ్మమంత పొడవున్న కుర్రాడొకడు విస్తరాకు నిండా వేడి వేడి యిడ్లీలూ, వడలూ తెచ్చిపెట్టాడు.

''అన్ని వద్దు... తినలేను...'' అంటూ గింజుకున్నాను.

''తిను... తినలేకపోతే వొదిలేయ్'' అంటూ అతను నిముషంలో తన ఆకు ఖాళీ చేసేశాడు. ''త్వరగా ముగించు... పొద్దంతా తినేదానికే సరిపెట్టేట్టుండావు...'' అని బిగ్గరగా నవ్వసాగాడు. నా ఆకు ఖాళీ అయ్యేసరికి పెద్ద గాజుగ్లాసు నిండా టీ వచ్చింది.

''నీ డబ్బులు నీవీ, నా రూకలునావీ... అదీ రూలు...'' అంటూ గడ్డంవాడు తన బిల్లు తానే యిచ్చాడు.

యిద్దరమూ బయటికొచ్చాము. గట్లు వొరుసుకుని ప్రవహించే జలరాశిలా, రెండు గుడారాల వరసల మధ్య జనప్రవాహం వురకలు వేస్తోంది. కరాళదెయ్యమేదో నాట్యం చేస్తున్నట్టు , ప్రక్క గుడారంలోంచీ పెద్దగా కర్ణకఠోరమైన చప్పుడు వెలువడుతోంది.

''చూద్దామా, పడదామా వొకపట్టు..'' అని పెద్దగా నవ్వుతూ అతను ఆ పెద్ద డేరాలోకి లాక్కెళ్లాడు నన్ను.

నేలలోకి పాతిన గుంజల పైన చెక్కలు పరచి వలయాకారంలో తయారుచేసిన బెంచీలు... వాటిముందు యింకాస్త యెత్తుగా అవే రకం బెంచీలు... చిన్న బెంచీలపైన బారులు తీరిన మనుషులు. ప్రతి వ్యక్తి ముందూ పెద్ద బెంచీపైన చదరంగపు బల్లల్లా కనిపిస్తున్న చతురస్రాల గళ్లు... గళ్లల్లో వేర్వేరు అంకెలు... మధ్యలో యెత్తయిన వేదికపైన కూర్చున్న వ్యక్తి చిన్న రకం రొటేటింగ్ పాన్‌లోంచీ నెంబర్లున్న రేకుల్ని తీసి, బిగ్గరగా అంకెలు అరుస్తున్నాడు.

''ఆ పక్క రెండు సీట్లుండాయి పద...'' అంటూ అతను లాక్కెళ్లి నన్నో బోర్డు ముందు కుదేశాడు.

''నాకీ ఆటరాదు...'' అన్నాను బిడియంగా.

అటువైపు వరస చివర్లోంచీ యెవరో ''ప్రైజ్'' అని అరుస్తున్నారు.

''ఆ గల్లా పిల్లోడు యీసారొచ్చినప్పుడు నీ బోర్డు దుడ్లు కట్టెయ్...'' అని ఆజ్ఞాపించాడు గడ్డంవాడు. చాలనిదానికి ''రెండుసార్లు వోడిపోతే, మూడోసారి అదే వస్తుంది. చింతపిచ్చలాట ఆడేది కూడా బమ్మాండమా?'' అని కిళారించాడు.

మొదటి మూడు ఆటలూ వోడిపోక తప్పలేదు. కానీ నెంబర్లు అరుస్తున్నప్పుడు గళ్లల్లో చింతగింజల్ని పేర్చడం మాత్రం నేర్చుకున్నాను. నాలుగోసారి నా బోర్డులో, వరుస నెంబర్లన్నీ వచ్చేశాయి. తప్పో వప్పో తెలియకపోవడంతో, జంకుతూనే ''ప్ర...యి...జ్'' అని కేకేశాను. గడ్డం వాడు నావైపు యెగాదిగా చూసి, బోర్డును పరికించి ''యేమోననుకుంటిని? భలే పనోడే నువ్వు...'' అని యెగిరి గంతేశాడు.

గల్లా కుర్రాడు గుప్పెడు నోట్లు తెచ్చి నా ముందు పోసి ''యెంచుకోన్నోవ్... మల్లంక తక్కువుందనేవు...'' అని హెచ్చరించి వెళ్లిపోయాడు.

మరో ఆట... యింకో ఆట... పాపం. గడ్డంవాడు ప్రతీసారీ వోడిపోతూనే వున్నాడు.

''నీ బోర్డుకు కూడా నేను దుడ్లు కడతానీసారి పోనీ...'' మాటల్ని కూడబలుక్కుంటూ అడిగాను.

అతనో పెద్ద నవ్వు నవ్వి ''వోడిపోతా వుండాననా? యిట్లాంటి బుడ్డ బెదిరింపుల్కకంతా బెదిరేవాణ్ణి గాదు. మనది చిట్లంపల్లి నెత్తురు. గెలిచేదాంకా దీన్ని వొదిలి పెట్టేది లేదు. బాంచెత్...'' అని మీసం మెలేశాడు.

యెన్ని ఆటలు గడచాయో లెక్కపెట్టగలిగే తీరిక లేదు. గుడారంలో కొన్ని బోర్డులు ఖాళీ అవుతూనే వున్నాయి. కొత్తవాళ్లు వచ్చి ఆడుతూనే వున్నారు. అందమైన ఆడపిల్ల గాజుల శబ్దంలా నెంబర్ల డ్రమ్ములోంచీ చప్పుడు మోగుతూనే వుంది. బయటి కోలాహలం మ్రోతెత్తిపోతోంది. పాపం,గడ్డంవాడి జేబులో డబ్బు తరిగిపోతూనే వుంది. యీలోగా నేను రెండోసారి గూడా గెలిచాను. పాపం. వాడొక్కసారైనా గెలిస్తే బావుణ్ణు. వాడి సంగతేమో గానీ, నాకే చెప్పలేనంత టెన్షన్‌గా వుంది. డ్రమ్ముమవాడు నెంబరు అరిచినప్పుడల్లా నేను పక్క బోర్డులకేసే చూడసాగాను. చాలాసేపటి తర్వాత, మూగవాడికున్నట్టుండి

గొంతుకొచ్చినట్టుగా, గడ్డంవాడు ''ప్రయిజ్...'' అని అరిచాడు. వెంటనే నేనూ ప్రతిధ్వనిలా ''అవునవును... యీసారి ప్రయిజ్ నీదే!'' అని గొంతు చించుకున్నాను. గల్లా కుర్రాడిచ్చిన డబ్బుల్ని జేబులో కుక్కుకుని ''యిక పోదామా!'' అని అట్టహాసంగా నవ్వుతూ గుడారం బయటికి నడిచాడు గడ్డంవాడు.

సూర్యుడు నడినెత్తిపైకొచ్చేశాడు. భగభగమండుతున్న యెండలో, రేగుతున్న దుమ్ములో అన్ని వైపులనుంచీ క్రమ్ముకుంటున్న చెమట వాసన్ల మధ్యలో, మనుషులు హడావుడిగా తిరుగుతూనే వున్నారు. వో నడిప్రాయపు స్త్రీ వో కూడలి మధ్యలో యెండల్తోనే మండుతున్నట్లున్న పొయ్యిపైన, జానెడు పొడవున్న మిరపకాయ బజ్జీల్ని కాలుస్తోంది. గడ్డంవాడు ''యెవరు యెక్కువసార్లు గెలిచినారో వాళ్లు పార్టీ యియ్యాల్సిందే!'' అన్నాడు.

రెండు మిరపకాయ బజ్జీలు నమిలేసరికి, కారం నషాలానికంటి, కళ్లల్లోంచీ నీళ్లు తన్నుకొచ్చాయి. నోరు మండిపోయింది. ఆ పక్కనే రంగు నీళ్ల షర్బత్తంగడి సిద్ధంగా వుంది. రెండు గ్లాసులు తాగాక కానీ నోరారలేదు.

''బేల్‌పూరీకి తావుందా సామీ కడుపులో'' అవతలి అద్దాల తోపుడు బండి దగ్గరినుంచీ చాలెంజి లాంటి ఆహ్వానం అందింది.

''వేస్కో రెండు ప్లేట్లు....'' గడ్డంవాడు బెదిరేట్టు లేడు.

''యీ దాణా బీణా వొకపక్కకు కూడా చాలదు. బిన్నాగా ముగించు. ఆ పక్క సాయిబుల వోటల్లో కుష్కా వుడకతా వుంటుంది మనకోసరం'' అన్నాడతను.

''యింకా తిండా? నా వల్ల కాదు'' గునిశాన్నేను.

''తిను తిను... యెట్లకాదో చూద్దాం...'' అన్నాడతను. అనడమే కాదు. అన్నంతపనీ చేశాడు. మసాలా వాసనలు ముక్కుపుటాల్ని వూపి పారేస్తున్న వో గుడారంలో, యిరవై ముప్పయిమ్మంది సహయాత్రీకుల మధ్యలో, పాత సిల్వర్ పాత్రల్లో వడ్డించిన కుష్కానీ పులుసునీ వర్ణనగలిగే వాడెవ్వడు?

బరువెక్కిన కడుపుల్తో భుక్తాయాసంతో బయటపడ్డం. ఘాటైన కిళ్లీలు రెండు కొని, వొకటి నాకిచ్చాడు గడ్డంవాడు. తాంబూలం నములుతూ ముందుకు కదిలాం.

మరో కూడలిలో జనం చుట్టూ నిలబడి చూస్తూ వుండగా, మధ్యలో దొమ్మరాట సాగుతోంది. జనాల తలలపైన్నుంచీ, భుజాల సందుల్లోంచీ, శరీరాల మధ్య నలిగిపోతూ అటువైపుకు చూశాం. తీగపైన నడుస్తూ దొమ్మరిపిల్ల... కింద చిన్న తీగ చక్రంలోంచీ దూరుతూ వో యువకుడూ.... పాత రాతికాలం నాటిదేమో ననిపిస్తున్న చర్మ వాయిద్యాన్ని బాదుతూ వో పదేళ్ల కుర్రాడూ... హుషారెత్తించడం కోసం చప్పట్లు చరుస్తూ చుట్టూ జనమూ... రెండు వేళ్లూ పెదవుల మధ్య పెట్టి గడ్డంవాడు పెద్దగా యీల వేశాడు. నేనూ యీల వేయడానికి ప్రయత్నించాను. యెన్ని రకాలుగా ప్రయత్నించినా శబ్దం పుట్టలేదు. విసుగొచ్చి ముఖం ముడుచుకున్నాను.

దొమ్మరాట దగ్గరనుంచీ వెనుదిరిగి మరోవైపుకు నడుస్తుండగా ''పట్టుకో... పట్టుకో''

అంటూ కేకలు వినిపించాయి. కంగారుపడుతూ వెనుదిరిగి చూశానో లేదో, పెద్దగా గగ్గోలు చేస్తూ పోట్ల గిత్తొకటి మావైపుకు దుముకుతూ కనిపించింది. ''తప్పుకో... తప్పుకో...'' అంటూ గడ్డంవాడు నన్ను పక్కకుతోశాడు. యేం జరుగుతోందో తెలిసేలోగా చేతికేదో అందింది. దాన్నలా పట్టుకునే దూరంగా యెగిరిపడ్డాను. దుమ్ము రేపుకుంటూ వెళ్తున్న యెద్దు వెనకే కుర్రాళ్ల గుంపొకటి హాహాకారాలు చేస్తూ పరిగెట్టుకెళ్లిపోయింది.

రెండు మూడు నిమిషాల తర్వాత ''నాకు ముందే తెలుసు. నువ్వు చిన్నా పన్నా మనిషివి కాదు. యింతమంది చూస్తావుండంగానే యెద్దు కొమ్ములకు గట్టిన సప్పరం తన్నుకొచ్చేసినావే! చూడు చూడు. దాంట్లో యెంత దుడ్డు కట్టినారో... అదింక నీదే!...'' అంటూ గడ్డంవాడు నన్ను లేపి నిల్చోబెట్టాడు. శరీరానికంటిన దుమ్ము దులుపుకుంటూ బిక్కమొహం పెట్టాను.

''నా కాళ్లల్లో చక్రాలుండాయనీ, వడ్డారం మనిషిననీ మా భజన సంఘమోళ్లెవరూ నాతో రాను జంకతారు. నిన్ను చూసినప్పుడే కనిపెట్టేసినాన్లే. నాకంటే రెండాకులెక్కువగా తినే రకం నువ్వని...'' అతను మళ్లీ నన్ను ముందుకు లాక్కెళ్లాడు.

డేరాల అంగళ్లు పలచబడ్డాక, జనాల పొలకువ తగ్గినచోట, నది గట్టు దగ్గర, అయిదారు మంది మనుషులు వొంటినిండా మట్టి పూసుకుని, యెండలోనే యిసుక తిన్నెలపైన పడుకుని కనిపించారు.

''మట్టే గదా అనుకోవద్దు... చానా రోగాలకు అదే పెద్ద మందంట! ఆ పట్టేయించు కోవాలంటే ఆ పెద్ద తెల్లగడ్డమాయనకు యెంత దుడ్డడిగితే అంతియ్యాల్సిందే! నీకిష్టంగా వుంటే మల్లంక మట్టిలో దొర్లదాం గానీ ముందీ నీళ్లలో దువుకులాడుదాం రా!'' అంటూ యెగిరి నీళ్లల్లోకి గెంతాడతను.

నేను కాస్సేపు గట్టునే యిసుకపైన పడుకున్నాను. నీళ్లపైనుంచీ వీస్తున్న వేడి గాలి కూడా బాగానే వుంది. అటువైపున మట్టి రాసుకుని పడుకున్న మనుషులు చందనం పులుము కున్నామనుకుంటున్నారేమో, గలగలా నవ్వుకుంటున్నారు. నది నీళ్లల్లో యీతలాడుతున్న కుర్రాళ్ల గుంపు కేరింతలు కొడుతోంది. నెమ్మదిగా కాళ్లు మాత్రం నీళ్లలోకి దించాను. పారుతున్న నీటిలో పాదాలు మోపిన దగ్గర యిసుక తరలిపోతూ చక్కలిగింతలు పెడుతోంది. గడ్డంవాడు నీళ్లలోంచే చేయి చాపి నా కాళ్లు పట్టి లాగేశాడు. అమాంతంగా తూలి నీళ్లల్లో పడ్డాను. ముక్కుల్లోకీ, చెవుల్లోకీ, నోట్లోకీ నీళ్లు దూరేశాయి. వూపిరి తిరగలేదు కాస్సేపు. ''పెద్ద కీనేరు బాయిలోకి దూకేసినట్టుగా గాబర గీబర మంటావేంది? లేచి నిలబడి చూడు. తొడలోతు కూడా లేదిక్కడ. కొంచెం కాళ్లూ చేతులూ ఆడించు. యీతదే వస్తింది...'' అని కసురుకున్నాడతను.

పది పదిహేను నిముషాల తర్వాత నీళ్లంటే భయం పోయింది. చేతులతో నీళ్లెగర గొడుతూ, కాళ్లు పైకి తేలేస్తుంటే భలే సుఖంగా తోచింది.

వొడ్డుపైన మరో శబ్దవీచిక సుళ్లు తిరగడం మొదలుపెట్టాక గానీ చాలా సేపయిన సంగతి

స్ఫురించలేదు నాకు.

అంతవరకూ యీతలాడిన కుర్రాళ్లందరూ రెండు జట్లుగా విడిపోయి యిసుకలో కబడీ ఆడటం మొదలుపెట్టారు. ఆశ్చర్యం. గడ్డంవాడు కూడా వో జట్టులో చేరిపోయి కదం తొక్కుతున్నాడు.

గుక్కెడు నీళ్ల మరోసారి తనివి తీరా తాగి నది బయటికొచ్చాను. బట్టలన్నీ తడిసిపోయి వున్నాయి. జేబులోని పర్సులోకి గూడా నీళ్ల దిగాయి. నోట్లు కూడా తడిసిపోయాయి.

''భలే దుడ్డు జూసినావుగానీ రా! రెండు ఆటలాడదాం!'' అన్న గడ్డంవాడి కేక వినిపించింది. ''నేనీ పక్క... నువ్వా పక్క... యిక కానీ చూద్దాం... రేయ్ పిల్లకాయలూ! యిప్పుడెవర్రా కూత కుయ్యాల్సింది?'' తనే ఆటగాడూ, రెఫరీ రెండూ అయినట్లుగా గడ్డంవాడు ద్విపాత్రాభినయం మొదలుపెట్టాడు. కుర్రాళ్లయినా వొక్కొక్కడూ నా అంతున్నాడు. వాళ్లతో నెగ్గకపోతే నా మానం పోదూ!

నాలుగైదు ఆటలు గడిచాయి. వోసారి అవుటయినప్పుడు పక్కకొచ్చి కూర్చున్నాను. నదిలోపల పుట్టిపైన యాత్రీకుల గుంపొకటి పెద్దగా పాడుతూ వెళ్తోంది. దూరంగా గుడి దగ్గరనుంచీ వాయిద్యాల ఘోష మిన్ను ముడుతోంది. సూర్యుడెప్పుడో పడమటి ప్రాంతాలకు చేరువైపోయాడు. లేలేత యెరుపు కిరణాలు సోకుతుంటే నది జాతరలో పాల్గొనే నిశ్శబ్ద యాత్రికుడిలా గుణగుణా సాగిపోతోంది.

కాస్సేపు గడిచిపోయింది. మరో ఆట ప్రారంభించే ముందు పిల్లలు పిలుస్తారేమోనని యెదురుచూశాను. యెంతకూ పిలుపు రాలేదు. విసుగ్గా వెనుదిరిగి చూశాను. పిల్లలు ఆడుకుంటూనే వున్నారు. కానీ... కానీ... గడ్డం వాడు యేడీ?... యెక్కడతను..? కనిపించడేం? యేమయ్యాడతను? కంగారుపడుతూ వో దూకు దుమికి ''గెడ్డం వాడెక్కడ?'' అని అడిగానో కుర్రాణ్ణి.

''యెప్పుడో వెళ్లిపోయాడు గదా!'' అదేదో మామూలు విషయమైనట్లుగా చెప్పేసి, వాడు మళ్లీ ఆటలోకి దూరేశాడు.

చుట్టూ రెండుమూడుసార్లు తిరిగాను. అతనెక్కడా కనిపించలేదు. మట్టి స్నానం చేస్తున్న వాళ్ల షిఫ్టు మారినట్టుంది. కొందరు సన్‌బాత్ చేస్తుండగా మరికొందరు జలస్నానం చేస్తున్నారు. జనసముదాయంలోకి జొరబడ్డాను. యెటుచూసినా జనమే! రకరకాల వయస్సులవాళ్లు.. రకరకాల రంగులవాళ్లు... రకరకాల దుస్తులవాళ్లు... రకరకాల ప్రాంతాల వాళ్లు.. రకరకాలగడ్డాలవాళ్లు.. కండెచుట్టూతిరిగే దారంలా ఆ జాతర సముదాయాన్నంతా రకరకాలుగా చుట్టేశాను. కానీ గడ్డంవాడు, ఆ నలుపూ తెలుపూ గడ్డం వాడు, కనిపించ లేదు. నలుగురైదుగుర్ని వాకబు చేసి చూశాను.

''పేరేమి... వూరేది?... యెంత వయసు?''

అన్నీ పిచ్చి ప్రశ్నలే అడిగారు వాళ్లు... వాళ్లనడిగి లాభమేముంది? నల్లటి గడ్డం...

మధ్యలో, సరిగ్గా మధ్యలో, తెల్లపాయొకటి చివరిదాకా... అతను... అతనే... యెక్కడండీ అతను?

రెండు డేరాల మధ్యలో చిన్న పీట వేసుకుని, వో మంగలివాడు గడ్డాలు గీస్తూ కనిపించాడు.

''చూడూ! నలుపూ తెలుపూ గడ్డంవాడు. నల్లటి గడ్డానికి సరిగ్గా మధ్యలో తెల్లటి పాయొకటి... అతన్ని చూశావా నువ్వు! చెప్పు త్వరగా!'' అని వేగిరపరచానతణ్ణి.

అతను కత్తిని పక్కన పెట్టి నాకేసి పరకాయించి చూశాడు. ''యిపుడు చూస్తానే వుండానుగదా! కావాల్లంటే నువ్వూ చూడు...'' అని అతను చిన్న అద్దం నా చేతికిచ్చాడు. నిజమే! దీక్షలో పెరిగిన నా పొడవాడి గడ్డంలో మధ్యగా తెల్లటి పాయొకటి వుంది. యిద్దరు తెలుపూ నలుపూ గడ్డం వాళ్లుంటే అతడినెలా కనిపెట్టడం?

''గడ్డం పని చేసుకుంటావా సామీ! చణంలో పొడ(రాసినంత వెత్తంగా షేవింగ్ చేసేస్తాను'' అన్నాడు మంగలివాడు.

మారు మాటాడకుండా అతడిముందు కూర్చున్నాను. పని ముగించాక మళ్లీ అద్దం నా చేతికిచ్చాడతను. నున్నటి గడ్డం జనాలు లేని నేలలా బోసిగా కనిపించింది. జేబులోంచీ నోటొకటి తీసి, అతడి సరంజామా పైన పెట్టి, పైకి లేచాను.

యిప్పుడిక్కడ వొక్కడే నలుపూ తెలుపూ గడ్డం వాడున్నాడు. యింకెక్కడికి తప్పించుకుపోగలడు వాడు? రెండు మూడు కూడళ్ల దగ్గర వాకబు చేశాను. యింతలో యెవడో వో అబ్బాయి గబగబా వచ్చి నా చేయి పట్టుకుని ఆపాడు.

''అవును... మీరే! నిజ్జంగా మీరేనా? ఆ వేషంలో దంచేసినారు సార్!''

యింకో కుర్రాడు నన్నమాంతంగా కౌగిలించుకున్నాడు. ''మీ రోలు అదిరింది సార్! సూపర్ హిట్... అంతా మీ వల్లనే!'' అంటున్నాడతను.

చూస్తూ వుండగానే నా చుట్టూ జనం గుమికూడి పోయారు. మాట్లాడనివ్వలేదు. కదలనివ్వలేదు. వూపిరి పీల్చుకోనివ్వలేదు. నా రెండో చిత్రం నేను యాత్రలో వున్నప్పుడెప్పుడో, రెండు మూడు వారాల క్రితం విడుదలైనట్టుంది. నాకెప్పుడో తెలుసు అది పెద్ద హిట్టవుతుందని. గడ్డం గీసుకుని రావడంతో నా అసలు స్వరూపం బయటపడినట్టుంది. అందరూ గుర్తుపట్టేశారు.

''సార్! ఆటో(గ్రాఫ్!'' కుర్రాడొకడు సంతకం కోసం యాభై రూపాయల కాగితాన్ని నా ముందుకు చాపుతున్నాడు. ''యిది మీ గుర్తుగా నేనుంచుకుంటాను...'' నా రుమాలు వొకతను లాక్కుంటున్నాడు.

వాళ్ల వరస చూడబోతే నన్ను యేకీలు కాకీలు వూడలాగి జ్ఞాపకచిహ్నంగా దాచుకునేలా వున్నారు. ''తప్పుకోండి, తప్పుకోండి'' అని వాళ్లని బ్రతిమలాడాను. చివరికి వున్మాదిలా పరిగెత్తసాగాను. జనం నా వెంట పరిగెత్తసాగారు. యెదురుగా మా బస్సు కనిపించింది.

బస్సులోకి పరుగు పరుగునా యెగబ్రాకి నా సీట్లోకెళ్లి కూర్చున్నాను. యాత్రీకులందరూ తమ తమ సీట్లలో కూర్చుని వున్నారు.

కాస్సేపటి తర్వాత నన్ను గుర్తుపట్టిన డ్రైవరు ''బతికించినావు సామీ! గంటసేపట్నుంచీ నీ కొసరమే యెదురుచూస్తా వుండాము. యేమయిపోయినావు?'' అని విసుక్కుంటూ యింజను స్టార్టు చేశాడు.

''జాతరలో యేం చేసినావు మహానుభావా! జనమెందుకు నీ వెంట పరుగెత్తు కొస్తున్నారు?'' అంటూ పక్కసీటు పాసింజరు యెకసెక్కాలు పోయాడు.

జనం కిటికీ కతవలినుంచీ చేతుల చాపి నా చేతిని నలిపేయసాగారు. బస్సు వేగం పుంజుకున్నాక గానీ వూపిరి తిరగలేదు నాకు.

బస్సు గుండ్రంగా వో మలుపు తిరిగి, మళ్లీ జాతర వైపుకు పరుగుతీసింది. జాతర చక్రాన్ని రెండుగా విభజిస్తున్నట్లున్న మట్టి రోడ్డుపైన వేగంగా దౌడు తీయసాగింది. ఆశ్చర్యం... జనాల మధ్యలో నలుపూ, తెలుపూ గడ్డంవాడు కనిపించాడు. ''వాడే! అదిగో అక్కడ...'' అని బిగ్గరగా అరిచాను. ప్రయాణికులంతా త్రుళ్లిపడి నాకేసి వింతగా చూడసాగారు.

''యిడుగో, యిక్కడ కూడా వాడే!'' అని మళ్లీ అరిచాను. యీసారి ప్రయాణికులు వులిక్కిపడలేదు. నాకేసి చూస్తూ అదోలా నవ్వసాగారు.

ఆశ్చర్యం, అద్భుతం. వొక్కడు కాదు. అక్కడక్కడా, ప్రతి గుంపులోనూ వొక్కడుగా, ప్రతి యిద్దరిలోనూ వొక్కడుగా, గడ్డంవాడు కనిపించసాగాడు. బస్సాగలేదు. గడ్డంవాడి వీడ్కోలు గీతంలా జాతర నాదం అంతకంతకూ దూరమైపోసాగింది. బాగా దూరానికి వెళ్లిపోయిన తర్వాత పరకాయించి చూస్తే, జాతర సముదాయమంతా కలిసి గడ్డం వాడి ముఖంలా చిత్రంగా గోచరించసాగింది.

నా సీటుకెదురుగా సూట్‌కేసుపైన మందుల డబ్బా కనిపించింది. ఆరోజు వుదయం నుంచీ మాత్రలేవీ మింగలేదన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. చాలా రోజుల తర్వాత కడుపునిండా తిన్నానన్న విషయం గుర్తుకొచ్చింది. దాదాపు వో పగలంతా నా కణత నరం మెలి తిరగలేదు. తొడ కండరం సుడి తిప్పలేదు. తెలుపూ నలుపూ గడ్డం వాడిపైన కృతజ్ఞత పెల్లుబుకుతోంది. కానీ యేడీ అతను? యే గుంపులో, యే వేడుకలో, యే సంరంభంలో వున్నాడు వాడు? యెన్ని చోట్లయినా, యెంతకాలమయినా వెతకాలనే వుంది. కానీ యీ పాపులారిటీ ముంచుకొచ్చాక నా వెతుకులాట నన్ను వెతుక్కోనిస్తారా యీ జనాలు? యే ప్రత్యేకతా లేని సాధారణమైన వ్యక్తిగా, మామూలు మానవుడిగా, జనంతో కలిసి పదిమందిలో వొకడుగా, సముదాయంలో వొక భాగంగా, వొళ్లు మరచి గుంపులో కలిసిపోతూ నా మిత్రుడైన నలుపూ తెలుపు గడ్డం వాడిని అన్వేషించి పట్టుకోగలిగే దెప్పుడు? అది సాధ్యమేనా యికపైన? దాహం తీర్చుకోడానికి మామూలు నీళ్ల గ్లాసెడు చాలు. పెద్ద సముద్రంలో ప్రయాణం చేస్తున్నా, మంచినీళ్లు కరువైతే బతకడమెలా?

నీడల్లో, చీకట్లో, ఏొంటరితనంలో, నీళ్లలో, యెండలో, మట్టిలో గడపడమెలాగో తెలుసు. నాకు. జనస్నానపు రుచి యిప్పుడిప్పుడే తెలిసింది. కానీ...

సూట్‌కేస్ పైని మందుల డబ్బా వెక్కిరిస్తోంది నన్ను...

నా రెండో సినిమా పాత్రకు యిష్టమైన పిస్తోలు ఆట వూరిస్తోంది...

నాకు నిజంగా... నిజ్జంగా... భయమేస్తోంది.

(వినూత్న కథ : మే '96)